అంబేద్కర్‌ని బీజేపీ గౌరవించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అంబేద్కర్‌ని బీజేపీ పార్టీ గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి ఆరోపించారు. ఓట్ల, అధికారం కోసం మహాత్ములను బీజేపీ వాడుకుంటోందని ఆమె విమర్శించారు. 5సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు ప్రధాని మోదీకి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం కట్టాలని ఆలోచన రాలేదని, మోదీ ప్రధానిగా ఉండగా గుజరాత్‌లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తుంటే పటేల్ సామాజిక వర్గాన్ని మభ్యపెట్టడానికి పటేల్ విగ్రహం కట్టారని, అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ప్రజల నుండి వ్యతిరేకత రావడంతో పార్టీ నాయకులు అది కప్పి పుచ్చుకోవడానికి కష్టాలు పడుతున్నారని ఆమె అన్నారు. అంబేద్కర్ మీద బీజేపీకి అభిమానం ఉంటే అమిత్‌షాతో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

జీవీఎంసీకి పి.ఆర్.ఎస్.ఐ. జాతీయ స్థాయి అవార్డు

విశాఖ నగర ప్రజల సహకారంతోనే పురస్కారం - జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా 2024 జాతీయ స్థాయి పురస్కారం ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమం కేటగిరిలో ప్రథమ స్థానం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు దక్కిందని, ముఖ్యంగా ఈ పురస్కారం విశాఖ నగర ప్రజల సంపూర్ణ సహ కారంతోనే లభించిందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. 2024 డిసెంబర్ 20 నుండి 22వ తేదీ వరకు ఛత్తీస్గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో జరిగిన 46వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ చతిస్‌గడ్ ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ ప్రారంభోత్సవం చేశారు. ఈ జాతీయ స్థాయి అవార్డును 21వ తేదీ శనివారం ఈ కాన్ఫరెన్స్‌లో ఫార్మర్ నేషనల్ ఎస్టీ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ నందకుమార్ సాయి, పిఆర్ఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాఠక్, నేషనల్ జనరల్ సెక్రెటరీ, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి నుండి జీవీఎంసీకి దక్కిన ఈ జాతీయ స్థాయి అవార్డును జీవీఎంసీ తరఫున అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎన్.నాగేశ్వరరావు స్వీకరించడం జరిగిందని ఆదివారం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, పర్యావరణహితమైన, సుందర నగరంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు జీవీఎంసీ అనేక కార్యక్రమాలను చేపడుతుందని, అందులో భాగంగా 2023 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు జీవీఎంసీ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలైన ఎకో-వైజాగ్ , స్వచ్ఛ సర్వేక్షన్, సీజనల్ వ్యాధులు నియంత్రణ, వ్యర్థాల విభజన, హోం కంపోస్టింగ్, కమ్యూనిటీ గార్డెనింగ్, నీటి పొదుపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలన తదితర అంశాలపై విశాఖ నగర ప్రజలను చైతన్యపరుస్తూ, పలు అవగాహన కార్యక్రమాలలో పాల్గొనేలా వారిని భాగస్వామ్యం చేస్తూ నిత్యం వారికి అవగాహన పరిచినందుకుగానూ జివిఎంసికి "ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమం కేటగిరిలో ప్రథమ స్థానంగా పిఆర్ఎస్ఐ గుర్తించి ఈ జాతీయ స్థాయి పురస్కారం అందించిందని అన్నారు. జీవీఎంసీ నిత్యం చేపడుతున్న పలు అభివృద్ధి, ప్రజా అవగాహన కార్యక్రమాలకు ముఖ్యంగా విశాఖ నగర ప్రజలు, విశాఖ నగర మేయర్, వార్డు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎస్.హెచ్.జి మహిళలు, ఆర్పీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ - ప్రైవేటు సంస్థలు, విద్య సంస్థలు, ఎన్జీవో సంస్థలు సహకారం వలనే జీవీఎంసీకి ఈ జాతీయ స్థాయి పురస్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.ఎస్.ఐ. నేషనల్ సౌత్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.శర్మ, రాయపూర్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ సాహిద్ అలీ, వైజాగ్ చాప్టర్ చైర్మన్ ఎంకెవిఎల్ నరసింహ (కాళీ) తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి ప్రసాద్ రెడ్డి విశాఖ డిపోలో నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా కొత్త బస్సులు వస్తాయని, వీటితోపాటు సుమారు 2000 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించుటకై ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లలాంటి వారిని కార్మికుల ఇబ్బందులు తీర్చడానికి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. అలాగే కార్మికులకు ఆరోగ్య సమస్యలపై ఉన్న ఇబ్బందులు దృష్ట్యా మెరుగైన సౌకర్యాలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని అతి త్వరలోనే ఇచ్చిన హామీని అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరానికి గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ సభ్యులు విజయ చంద్ర, జోనల్ చైర్మన్ దొన్ను దొర, డిటిసి ఆదినారాయణ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజం జి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కే.రాజశేఖర్, ఐ.వి.వి.పి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: సీపీఐ ఆవిర్భవించి ఈ నెల 26న 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని శత వార్షికోత్సవాలు జరుపు కుంటుందని సీపీఐ గాజువాక నియోజక వర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు పెద గంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం శత వార్షికోత్సవ ప్రత్యేక సంచికను సీపీఐ ఆవిష్కరించింది. అనంతరం కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ బీచ్ రోడ్ అల్లూరి విగ్రహం నుంచి ఆర్కే బీచ్ వరకు సీపీఐ కార్యకర్తలతో కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కవాతులో సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుత రావు, అప్పారీ విష్ణు మూర్తి, పి.దుర్గారావు, కె.పోతయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సన్నిధిలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఆలయ వైదిక సిబ్బంది, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ స్వామివారికి 108 బంగారు సంపెంగలతో అత్యంత వైభవంగా స్వర్ణపుష్పార్చన జరిపించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.త్రినాధరావు తెలిపారు. స్వామివారి స్వర్ణపుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చణ అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు చేసి ఆదుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని కోరుతూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివారం సీతంపేట ఆఫీసులో దక్షిణ నియోజక వర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్‌ని ఏఐటీయూసీ ఆటో ఫెడరేషన్ నాయకులు శివాజీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులు ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయల పనులు చెల్లిస్తున్న డ్రైవర్లు అనారోగ్య మంచాన పడిన ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబం రోడ్డును పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల అందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు చేసి ఆదుకోవాలని భారీగా జరిమానాలు పెంచుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు తగ్గించి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, వెంకట్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

డా. పల్లెం కృష్ణ ప్రసాద్‌కు "ఉత్తమ అధ్యాపక" పురస్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రముఖ నేత్ర వైద్యాలయం శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ పల్లెం కృష్ణ ప్రసాద్‌కు జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యాపక పురస్కారం లభించిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పి.ఆర్) కే.బంగార్రాజు తెలియజేశారు. ఎన్‌బిఈఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మిను బాజ్పాయ్ చేతులమీదుగా విశాఖలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నట్లు బంగారు రాజు తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బోర్డ్ అక్రెడిటెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఏఎన్ బీఏఐ) మెడికల్ టీచర్స్ డే ఈవెంట్ 2024 కాన్ఫరెన్స్‌లో డా.ఎన్.టి.ఆర్.ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.డీ.ఎస్వీ.ఎల్. నరసింహం, ఏఎన్ బీఏఐ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ డా.ఖుబ్ చంద్, జనరల్ సెక్రటరీ ఏఎన్ బీఏఐ, ఏపీ అండ్ టీఎస్ డాక్టర్ తిరుమల్ ప్రసాద్ సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సులో దేశంలోని 189 మెడికల్ ఎడ్యుకేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. శంకర్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పల్లెం కృష్ణ ప్రసాద్‌కు శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణన్, ఆసుపత్రి వైద్యులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

75వ వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి విజ్ఞప్తి మేరకు అదానీ గంగవరం పోర్టు వారి ఆధ్వర్యంలో విశాఖ ఐ కేర్ వారితో కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూ పోర్టు ఇన్‌స్పెక్టర్ తోకాడ కామేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. నెల్లిముక్కు రామాలయం వద్ద గల జీవీఎంసీ కల్యాణ మంపడంలో ఆధాని గంగవరం పోర్ట్ నుండి సి.హెచ్. రమేష్, ప్రసాద్, డాక్టర్ రేవతి బృందం పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, స్థానిక నాయకులు ములకలపల్లి పెంటయ్య, నాగిరెడ్డి, సోమ రెడ్డి, కన్నయ్య, పులి శ్రీరామ రెడ్డి, నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, కాకినాడ అప్పల రాజు, మొల్లి అప్పారావు, మొల్లి రమణ(అక్తర్), దొమ్మేటి సోము నాయుడు, మణికంత, నీలాపు అప్పల రెడ్డి, బస అప్పల రెడ్డి, కడవల రమణ, పులి అప్పల రెడ్డి, ఉరుకుటి అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాపై నివేదిక అందించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అనుమానాస్పదంగా వేరే ప్రాంతానికి తీసుకువెళ్తున్న తొమ్మిది మంది బాలికలను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారంలో పూర్తి సమాచారంతో రైల్వే పోలీసులు నివేదిక అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీతారాం మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా జరుపుతున్నారా, ఉపాధి పనులు కల్పించే నిమిత్తమా అన్నదానిపైన, అలాగే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టు ఆలస్యంగా కేసు నమోదు చేశారా, లేక త్వరితగతిన జరిగిందా, సంబంధిత అంశాలతో వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి నివేదిక అందజేయాలన్నారు. ఈ నివేదిక ఆధారంగా కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు: క్రైమ్ ఏసీపీ

విశాలాంధ్ర - పీఎం పాలెం: దొంగతనం కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు క్రైమ్ ఏసీపీ వెంకటరావు తెలిపారు. మధురవాడ పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పనోరమా హిల్స్‌లో 43 ఆ అనే ఒక విల్లాలో దొంగతనం జరిగిందని, సీతామహాలక్ష్మి వారి కుటుంబంతో కలిసి భీమవరంలోని ఒక సొంత పని మీద వెళ్లడం జరిగిందన్నారు. సీతామహాలక్ష్మి కేజీహెచ్‌లో డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని, భీమవరం వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగిందని, వెంటనే వారు పోలీసులను ఆశ్రయించడం జరిగిందన్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించగా గుజరాత్ వాళ్ళు దొంగతనం చేసే విధంగా తాము గుర్తించామన్నారు. వీళ్ళు ఇతర రాష్ట్రాలు నుంచి ఇక్కడికి వచ్చి లాడ్జీల్లో కాకుండా నగరం అంతట తిరిగి రెక్కీ నిర్వహిస్తారని, మొత్తం సుమారు 1.40 గ్రాములు బంగారం పోయిందని, ఇది సుమారు ఇది 45 లక్షల విలువ ఉంటుందన్నారు. ఈ సంఘటనలో దొరికిన ఫింగర్ ప్రింట్ ఆధారంగా కుందన్ అనే వ్యక్తి మధ్యప్రదేశ్‌లో ఉన్న వ్యక్తిగా మేము గుర్తించామని, ఇదంతా కుందన్ ఏ1 ఆధ్వర్యంలో జరిగిందన్నారు. వీళ్ళను ప్రాథమికంగా విచారణ చేస్తే 5లక్షల క్యాష్ దొరికిందన్నారు. మిగతా వారిని విచారణ చేయాల్సి ఉందని ఇంతలా రెక్కీ నిర్వహించి ముద్దాయిలు పట్టుకోవడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ మీడియా సమావేశంలో పోలీసులు అధికారులు పాల్గొన్నారు.

విభూతి యోగంపై ప్రవచనాలు ముగింపు

విశాలాంధ్ర - విశాఖపట్నం: వేదాంత ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరింలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీపీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ కార్యదర్శి పి.సోమరాజు హాజరయ్యారు. భగవద్గీతలోని 10వ అధ్యాయం అయిన "విభూతియోగం" మీద ఇంగ్లీషులో జరుగు ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం (ప్రవచనా ల)లో భాగంగా ఆఖరి రోజున స్వామి పార్థసారథి శిష్యురాలైన శుషిలాజీ మాన వులు అతి ఆవశ్యకమైన ఆత్మచింతనను వదిలి అనవసరపు ప్రాపంచిక విషయాలపై తమ దృష్టిని నిలుపుతున్నారని చెప్పారు. ఏ విధంగా విద్యుత్ శక్తి వివిధ రూపాలలో రుపాంతరం చెందుతుందో, అలాగే ఆత్మ కుడా అనంతమైన రుపాలలో ప్రకటిస్తు ఉదన్నారు. ఈ అధ్యాయంలో శ్రీక్రిష్ణుడు మానవుల ఆత్మ గురించిన పరిమితి ఆలో చనల నుండి, సర్వవ్యాపి, సర్వధారి, సర్వశక్తి మంతమైనదని తెలియ చెప్పటానికి ప్రయత్నించారు. ఈ విశ్వమంతా సముద్రంలో నీటి బొట్టులా పరమాత్మలో అణు మాత్రమేనని చెప్పారు. సకల మానవాళి ఆత్మసాక్షరతే లక్ష్యంగా అడుగులు వేయమని శుషిలాజీ తన ప్రవచనాలను ముగించారు. ఈ కార్యక్రమానికి ముందు భజన కీర్తనలను ఆలపించారు. నగరానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదాంత ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. స్వామి పార్థసారథి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు.

సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: పెందుర్తిలో ఈ నెల 28,29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ డిసెంబర్ 28వ తేదీ ఉదయం 10 గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి సుజాత నగర్ వరకు జరగనున్న మహా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పల నాయుడు, వి.నాగరాజు, కె.నాగరాణి, భాగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ చౌకీబాల్ పోటీలకు అసెంట్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర చౌకీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ జట్ల ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఎంపికైన జట్లను ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్లో జాతీయ చౌకీబాల్ చాంపియన్ షిప్‌కు పంపుతామని రాష్ట్ర కార్యదర్శి సుధాకర్రావు తెలిపారు. ఈ పోటీలలో పాలవలస అసెంట్ స్కూల్‌కు చెందిన 4 గురు విద్యార్థులు సిహెచ్.పార్థు, ఈ.రాంచరణ్, వి.ఉమామహేశ్వరావు, టి.జగన్ ఎంపికయ్యారు. ఎంపికైన అసెంట్ స్కూల్ క్రీడాకారులను రాష్ట్ర చౌక్ బాల్ లీగల్ అడ్వైజర్ కార్తీక్ కిరణ్, విశాఖ జిల్లా చౌక్బాల్ సెక్రటరీ కమ్ పిఈటి గాదిపల్లి సురేష్, అసెంట్ స్కూల్ చైర్మన్ శంకర్రావు, డైరెక్టర్ బంగారునాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

రెడ్డిపల్లి రహదారిపై ప్రయాణికుల ఇక్కట్లు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో గల సింహాచలం నుండి విజయనగరం వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. రెడ్డిపల్లి గ్రామం వద్ద విస్తరణ పనుల్లో భాగంగా గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా వదిలివేయడం వల్ల రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రధాన రహదారి రెడ్డిపల్లి వద్ద రోడ్డు చాలా గుంతలమయం అవటంవల్ల సాధారణ పరిస్థితిలో ఇబ్బంది పడుతూ ప్రయాణించే ప్రయాణికులు వర్షం పడినప్పుడు రోడ్డుపై ఏర్పడిన గుంతలు చెరువును తలపించేలా ఉండటం వల్ల ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనారోగ్యం పాలైన వారిని, గర్భిణీలను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే భయపడుతూ భయపడుతూ ఆసుపత్రికి ఈ రహదారి గుండా తీసుకెళ్లవలసి వస్తుంది. ఈ రహదారి గుండా ప్రజా ప్రతినిధులు ప్రయాణిస్తున్నా పట్టించుకోని వైనం. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రోడ్డు విస్తరణ మాట దేవుడెరుగు, ఉన్న గుంతలు కూడా పూడ్చకుండా మాకు ఏమి సంబంధం లేదు అన్నట్లుగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించి రోడ్డును బాగు చేస్తారని స్థానికులు, ప్రయాణికులు, వాహన చోదకులు విన్నవించుకుంటున్నారు.

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్

విశాలాంధ్ర - భీమిలి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప గణిత మేధావులలో శ్రీనివాస రామానుజ అయ్యంగార్ ఒకరని అలాంటి మహానుభావుడు మన దేశంలో జన్మించడం మనం చేసుకున్న అదృష్టమని ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. రామానుజన్ 137వ జయంతి సందర్భంగా ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి భీమిలి శాఖ అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గంటా నూకరాజు మాట్లాడారు. బ్రిటీష్ వారు మన దేశాన్ని పాలిస్తున్న రోజుల్లో రామానుజన్ గణితంపై అనేక పరిశోధనలు చేశారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జీవిత విశేషాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, గండిబోయిన పోలిరాజు, రాజగిరి రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తా

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర - పెందుర్తి: సభలు, సమావేశాలలో తాను ఇచ్చిన హామీలను శిలా శాసనంలా అమలు చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. మండలంలోని జెర్రిపోతుల పాలెం గ్రామంలో ఇటీవల 15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మడక అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని సభలోనే అధికారులకు నిర్దేశించారు. రేషన్ కార్డులు పింఛన్లు పక్కా ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని పండగలోగా అందరికీ వాటిని మంజూరు చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సంక్షేమం అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివని వెల్లడించారు. పార్టీలు వర్గాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. అంతకుముందు సర్పంచ్ మడక అప్పలరాజు, టిడిపి మహిళా అధ్యక్షురాలు మడక పార్వతి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జెర్రిపోతుల పాలెం గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు జరగలేదని ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అయితి సింహాచలం, సాలాపు అప్పారావు, గల్లా శ్రీనివాసరావు ఎంపీడీవో కే.వెంకటరావు, రెవిన్యూ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: కలిగొట్ల స్వర్గశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి తండ్రి స్వర్గీయ కలిగొట్ల భాస్కరరావు, మాజీ భీమిలి మున్సిపల్ వైస్ చైర్మన్ 24వ వర్ధంతి సందర్భంగా వలంద పేట, వేములవలస, తగరపువలస, భీమిలి, మొదవలస, వివిధ ప్రాంతల సంచార జాతుల నిరుపేద 60 కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్ రెడ్ బుక్‌లో విద్యార్థుల సమస్యలు లేవా?

ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఫణీంద్ర కుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 77ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులు రియంబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి దాపురించిందని తెలిపారు. అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఉప శమనం కలిగిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత హామీని అమలు చేయలేదని విమర్శించారు. అలాగే ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ రూ.3,850 కోట్లు పెండింగ్ లో ఉండడంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లోకేష్ రెడ్ బుక్‌లో విద్యార్థుల సమస్యలు పొందుపరచలేదా? అని ప్రశ్నించారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ కార్యదర్శి జె.అభిషేక్, జిల్లా నాయకులు మౌనిక, శివరాజ్ కుమార్, నెహేమియ, కిరణ్, హరి, పవన్ కల్యాణ్, ఆదర్శ్, అభి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం వార్షికోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం భీమిలి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆధ్యాత్మిక సభ నిర్వహించబడుతుందని ఆహ్వాన కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్ తెలిపారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 552 సంవత్సరాలుగా అర్థ సూఫీ సిద్ధాంత స్ఫూర్తితో మతాతీతమైన ఈశ్వర ఏకత్వ ప్రతిపాదనలతో కూడిన సర్వమత సమ్మతమైన ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రబోధిస్తూ జాతి, కుల, మత స్త్రీ పురుష ధనిక పేద అనే బేధం లేకుండా మతసామరస్యాన్ని పెంపొందించే విధానంలో మానసిక మనుగడ శాంతి సహృద్భావ వాతావరణంలో కొనసాగి సమాజ చైతన్యానికి అభివృద్ధికి మానవత విలువల పరిరక్షణకు కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠ నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా సద్గురువర్యులు అనుగ్రహభాషణ విని తరించవలసిందిగా ప్రజలను కోరారు. మరిన్ని వివరాలకు 9866 388 979, 9494929199 నంబర్లను సంప్రదించాలన్నారు.

వెంకటాద్రి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతిగా భాషిల్లుతున్న పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం 4.30 గంటలకు స్వామివారిని మేల్కొల్పి, అనంతరం తనయ విన్నపం చేసి హారతి చేశారు, మరియు సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, మరియు ప్రసాదాలు స్వామి వారికి నివేధన చేసారు. భక్తులకు తీర్థ గోష్ఠి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామనుజాచార్యులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 4 - 30నుండి సేవా కార్యక్రమాలు ఉంటాయి అని తెలిపారు.ప్రతి రోజు కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత వాహన సదుపాయం ఉంటుంది అని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం వారు ఏర్పాటు చేశారు అని ఈఓ నీలిమ తెలిపారు.

25న 'బుట్ట బొమ్మ' షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: వస్త్ర వ్యాపార రంగంలో 93ఏళ్ల అనుభవం ఉన్న 'బొమ్మన' సంస్థ ఈ నెల 25న విశాఖలోని మద్దిలపాలెంలో మరో శాఖను ప్రారంభించనుందని 'బుట్ట బొమ్మ' పేరిట క్రిస్మస్ రోజున షోరూం ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ అధినేత బొమ్మన సత్యరాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తరాలు మారినా తమ సంస్థకు ఆదరణ తగ్గలేదని, చేనేత కార్మికుల నుంచి నేరుగా చీరల్ని కొనుగోలు చేసి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చేరువ చేసేందుకే 'బుట్ట బొమ్మ'ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. 20ఏళ్లగా విశాఖ ప్రజానీకానికి చేరువైన తమ సంస్థ ఇకపై సామాన్యులకూ అందుబాటు ధరలో చీరల్ని అందించనున్నట్టు తెలిపారు. 'బుట్ట బొమ్మ' అధినేత బొమ్మన మణిరాజ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రా కల్చర్ తగ్గకుండా, సంప్రదాయం ఉట్టిపడేలా గద్వాల్, కంచి, ధర్మవరం చీరల్లో రూ.800నుంచి అందుబాటు లో ఉంచనున్నట్టు తెలిపారు. నార్త్ నుంచి సౌత్ వరకు అన్ని రకాల వస్త్రాల్నీ అందరికీ అందుబాటులోకి తెస్తున్నా మన్నారు. బొమ్మన సిల్క్స్ అధినేత బొమ్మన యువరాజ్ కుమార్ మాట్లాడుతూ తమకు ఏపీ వ్యాప్తంగా 15 షోరూంలున్నాయని, విశాఖ పరిధిలో గాజువాక, జగదాంబ, బీచ్‌రోడ్డులో శాఖలున్నాయని, 'బుట్ట బొమ్మ'తో కలిసి నాలుగు శాఖలవుతాయన్నారు. కార్యక్రమంలో బొమ్మన సునీత, బొమ్మన చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

కమల్ బెయిద్‌కు ప్రపంచ రికార్డు సర్టిఫికేట్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా "వర్చువల్ మెడిటేషన్ క్లాస్‌లో అత్యధిక హాజరు కోసం ప్రపంచ రికార్డులో పాల్గొన్నందుకు ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా కమల్ బైయిద్ వరల్డ్ రికార్డ్ సైటేషన్ అందుకున్నారు. ప్రపంచ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రముఖ సామాజిక కార్యకర్త, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, దాత మరియు పేదల పెన్నిధిగా పేరు పొందిన కమల్ బెయిద్‌కి నగరంలోని హబిల్డ్ సంస్థ ప్రపంచ రికార్డు ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ప్రపంచ వేడుకల సందర్భంగా కమల్ జీకి నగరంలోని ప్రముఖులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



మానవత్వం చాటుకున్న రౌతు బ్రదర్స్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో రౌతు బ్రదర్స్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మరొకరు విద్యార్థి విభాగం అధ్యక్షులు అభిమాన నాయకుడు జగన్ జన్మదినం పురస్కరించుకొని తమ వంతుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మండలంలో లిటిల్ హార్ట్స్ బాలల సంరక్షణ కేంద్రంలో పిల్లలతో కేక్ కటింగ్ చేయించి మిఠాయిలు పంచుతూ ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌతు బ్రదర్స్ సొంత నిధులతో బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్న పిల్లలకు బకెట్లు, జగ్గులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందని రౌతు బ్రదర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాడ పాపునాయుడు, పాల్గునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఇంటర్ యూనివర్శిటీ యోగ మహిళలు జట్టు ఎంపిక

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రాయూనివర్శిటి పురుషులు, మహిళలు యోగా జట్లు ఎంపిక జరిగింది. ఈసందర్భంగా ఏయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్శిటి యోగా పోటీలు భువనేశ్వర్ లో కిట్స్ యూనివర్శిటిలో ఈనెల 24 నుంచి 28 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ ఆశనాల్లో ఈపోటీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆచార్య ఎన్.విజయమోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి అభినందించి యోగాలో ప్రతిభ సాధించి వర్సిటికి మంచి పేరు తీసుకురావాన్నారు. యోగా కోచ్ వర్మ తదితరక్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల కళా ప్రతిభకు నగరవాసుల ప్రశంసలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రజలతో నగరవాసుల మనసులను దోచుకుంటున్నారు. ఫైన్ ఆర్ట్స్ విభాగ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానుల నుంచి, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తమ ప్రతిభతో తయారు చేసిన చిత్రాలను ప్రదర్శించడంతోపాటు వాటి విక్రయాలను సైతం ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన కళాఖండాలను నగరవాసులు ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తూ ఉండడంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శని ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలను, శిల్పాలను తయారు చేసే పనిలో నిమగ్నం అవుతున్నారు. విద్యార్థులు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన దీనికి లభిస్తోంది. ఇంటిలో అలంకరణకు, బహుమతులుగా ఇవ్వడానికి ఇక్కడ విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు వచ్చి వీటిని తిలకించి తమ మనసుకు నచ్చిన వాటిని కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నారు. ఈనెల 29 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7:00 వరకు శివాజీ పాలెం లోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుంది. విద్యార్థుల ప్రతిభకు నగరవాసుల నుంచి వస్తున్న ఆదరణ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని విభాగాధిపతి డి.సింహాచలం అన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

విశాలాంధ్ర - విశాఖపట్నం: మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ అన్నారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకంలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని అన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. మత్తు పదార్థాల వలన ఆరోగ్యం, భవిష్యత్తు నాశనం అవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులు గా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: మండల వ్యవసాయ అధికారిణి సంధ్య రత్న ప్రభ ఆదివారం పొదుగుపాలెం గ్రామంలో మండలం వ్యవసాయ సిబ్బంది గ్రామాలలో వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులుతో పొలంలో ఉన్న నీటిని బయటకు పంపుకోవాలని తడిచిన వరి పనలపై లీటర్ నీటికి 20 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించటం జరిగింది. ఇలా చేయడం వలన వరి గింజలు మొలకెత్తకుండా ఉంటాయని కొంత వరకు గింజలు రంగు మారకుండా ఉంటాయని తెలపడం జరిగింది.అలాగే 23 మరియు 24 తేదీల్లో కూడా వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవోతోపాటు అగ్రి కల్చర్ అసిస్టెంట్ రమేష్, రైతులు ఉన్నారు.

పిడకలతో బోగి మంట వేద్దాం: పీవీఎన్ మాధవ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: లక్షా ఒక్క పిడకలతో బోగి మంట వేద్దాం అని శాసనమండలి మాజి సభ్యులు పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఈమేరకు గురుద్వారా దగ్గర కేశవ సేవా సమితి కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న బోగి పండుగను పర్యావరణ హితంగా నిర్వహించుదామని పిలుపునిచ్చారు. బోగి పండుగ పేరుతో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చి అనారోగ్యం తీసుకుని రావద్దని అన్నారు. ఇంత పెద్ద మహానగరంలో వేలాది ప్రదేశాలలో టైర్లు, ప్లాస్టిక్ తో బోగి మంటలు వేస్తే వచ్చే వాయు కాలుష్యం చాలా ప్రమాదకరం అని వివరించారు. అలాగే బియ్యం పిండి, పసుపు , కుంకుమ లతో ముగ్గులు వెయ్యాలి అన్నారు. గ్యాస్ పిండి తో ముగ్గులు, రసాయన రంగులు, భార లోహాల రంగులతో ముగ్గులు అనారోగ్యకరం అన్నారు. పర్యావరణ హితంగా బోగి పండుగ చేసుకుని ఆరోగ్యంగా జీవిద్దాం అని అన్నారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమార్ స్వామి మాట్లాడుతూ హరిదాసులు, గంగిరెద్దులు, బుడబుక్కల వాళ్లు, కొమ్మ దాసరలు, బుడబుక్కల వాళ్లు, కోలాటం, తప్పెట గుళ్ళు, పులి వేషాలు, దేశీయ నృత్యాలతో సాంప్రదాయ బద్దంగా పండుగ నిర్వహించడం జరుగుతోంది అన్నారు. అలాగే పిల్లలకు బోగి పళ్ళు వేయడం, బోగి మంట దగ్గర పాయసం తయారు చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్, అశోక్ సత్వా నేచురల్స్ మధుసూదన్ రెడ్డి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

విశాలాంధ్ర - భీమిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ని వ్యంగంగా ఉచ్చరించి అంబేద్కర్‌ను స్మరించడం ఫ్యాషన్ అయిపోయిందని రామున్ని, కృష్ణుని స్మరించుకుంటే స్వర్గానికి పోతామని చెప్పడాన్ని ఖండిస్తూ తాళ్లవలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలి వద్ద భారీ రాస్తారోకో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోనీ సన్నీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, స్థానిక దళిత నాయకులు చెన్నా సత్యం, బోని సన్నిబాబు పూలమాలవేసి నివాళు లర్పించారు. రాస్తారోకోని ఉద్దేశించి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రిగా నియమింపబడిన అమీషా కుల మతాలకతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణ స్వీకారం చేస్తూ ఆ రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవహేళనగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే మానవాళి మనుగడ ఉన్నంత వరకు భారతదేశంలోనే కాక ప్రపంచ దేశాలలో అంబేద్కర్ చిరస్మరణీయుడు గానే ఉంటారన్నారు. అలాగే బోని సన్నుబాబు మాట్లాడుతూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకువచ్చే కుట్రలో భాగమే అంబేద్కర్‌పై అలాగే భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోని నరసింగరావు, బోనీ హరిబాబు, సియ్యాద్రి రాంబాబు, బోనీ ప్రసాద్, మట్ట ఆదినారాయణ, సిద్ధార్థ, యాగటి రామారావు, బోనీ శివ, బోని శ్రీను తదితర దళిత నాయకులు యువకులు పాల్గొన్నారు.

వావిలిపల్లికి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం

విశాలాంధ్ర -పొందూరు: ఈ నెల 28, 29 వ తేదీల్లో విజయవాడలోని కె.బి.ఎన్ కళాశాలలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ప్రతినిధిగా ప్రపంచ తెలుగు రచయితల సంఘం జీవితకాల సభ్యులు, కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు గ్రహీత, పొందూరు నివాసి వావిలిపల్లి రాజారావు మాస్టారికి ప్రపంచ తెలుగు రచయితల సంఘం నుండి ఆహ్వానం అందింది. 2017 లో హైదరాబాదులో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన తెలుగు మహాసభల్లో పాల్గొని కవితాగానం చేశారు. విజయవాడలో జరిగిన 4వ, 5వ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొని కవి సమ్మేళనంలో పాల్గొని కవితా పఠనం గావించారు. 2017లో తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన ప్రపంచ రికార్డు కవి సమ్మేళనములో పాల్గొని కవితా గానం చేశారు. 2018లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికచేయబడ్డారు. ఈయన ఎందరో మహానుభావులు అనే వ్యాస సంపుటి, మహోన్నత శిఖరాలు (శతాధిక కవితా మాలిక) నా దేశం (శతాధిక కవితా మాలిక) అనే పుస్తకాలను రచించి ప్రచురించారు. అనేక మాస పత్రికలు, దిన పత్రికలలో ఈయన కవితలు, కథలు, వ్యాసాలు ప్రచురితమైనవి.ఎన్నో అవార్డులు పురస్కారాలు ఆయనను వరించాయి.

స్నాచింగ్ నేరాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

- 8.25 తులాల బంగారం కేసు ప్రాపర్టీ స్వాధీనం
- నిందితుడిపై పలు కేసులు నమోదు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం/ కవిటి: జిల్లా, కాశీబుగ్గ సబ్ డివిజన్, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషనులో నమోదు కాబడిన రోబరి, చైన్ స్నాచింగ్ కేసులలో నిందితున్ని అరెస్టు చేసి, కేసు ప్రాపర్టీని పూర్తిస్థాయిలో రికవరీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు, కొజ్జారియా జంక్షన్, కవిటి మండలం వద్ద కవిటి పోలీస్ స్టేషన్లో నమోదైన రోబరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో పట్టుబడిన నిందితుడు నర్తు రాజేష్, బైరిపురం గ్రామం, కవిటి మండలంకు చెందినవాడన్నారు. కవిటి పోలీసు ఆయన్ను అరెస్టు చేసి దర్యాప్తులో భాగంగా విచారణ చేయగా నిందితుడు నుండి కవిటి, కంచిలి మరియు ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన రెండేసి కేసులు (మొత్తం 6 కేసులు) యొక్క చోరీ సొత్తు 8.25 తులాల బంగారం విలువ సుమారు రూ.7,76,958/- రికవరీ చేయడం జరిగిందని వెల్లడించారు. నేరం జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు తెలియజేశారు. పై కేసులను ఛేధించుటలో కాశీబుగ్గ డిఎస్పి ఎం.అప్పారావు, ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.చిన్నం నాయుడు, ఇచ్ఛాపురం మరియు కవిటి సబ్ ఇన్స్పెక్టర్లను, ఇతర పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవి మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

సరుగుడు, నీలగిరికి గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర -ఎచ్చెర్ల: సరుగుడు, నీలగిరికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సరుగుడు, నీలగిరి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బస్వ గురుమూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు గాలి వెంకటరెడ్డిలు కోరారు. మండలం కేశవరావుపేట జంక్షన్‌కు సమీపంలో జిల్లాకు చెందిన సరుగుడు, నీలగిరి రైతులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో సరుగుడు, నీలగిరి తోటల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంద లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జిల్లా నుంచి సరుగుడు, నీలగిరిని జేకే పేపర్మిల్లు(రాయఘడ), ఏపీ పేపర్ మిల్లు (రాజమండ్రి), ఐటీసీ పేపర్ మిల్లు (భద్రాచలం) కు ఎగుమవుతున్నట్టు చెప్పారు. అయితే ఈ ఏడాది డిసెంబరు 10వ తేదీ వరకు 18 అడుగులు ఉండే సరుగుడు కర్రల టన్ను రూ.9,200లకు చేసేవారన్నారు. ఇదే కొలతల కర్రలు ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదని, మిల్లర్ల చుట్టూ తిరిగితే ఐదారు వేలకు మించి కొనుగోలు చేయడంలేదన్నారు. రైతులు వేలాది రూపాయలు వెచ్చించి సాగుచేసిన సరుగుడు, నీలగిరికి ఒక్కసారిగా ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీలగిరి కర్రలు టన్ను రూ.8 వేలు ఉండగా, దీన్ని కూడా రూ.500 తగ్గించారని, ఈ ధర మరింత తగ్గుతుందని మిల్లర్లు చెబుతున్నారన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సరుగుడు, నీలగిరికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బి.రాంబాబు, ఆరేళ్ల కృష్ణ, పైడిపెద్ది పూర్ణచంద్రరావు, అలుపన సింహాచలం, బగ్గ శ్రీను, ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఆకాశవాణిలో కొండలరావు ప్రసంగాలు

విశాలాంధ్ర - పొందూరు: ఈనెల 23, 24, 26, 28 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు చింతన కార్యక్రమంలో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపై నామవిజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు వ్యాఖ్యానం ప్రసారమవుతుంది. ఇప్పటికే ఈ అంశాలపై ఆకాశవాణి కేంద్రం స్టేషన్ డైరెక్టర్ ఇందిర పర్యవేక్షణలో డ్యూటీ ఆఫీసర్ తేతలి దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రికార్డింగ్ జరిగింది. గతంలో పలుమార్లు దేశభాషలందు తెలుగు లెస్స, ఊరు-పేరు, గ్రామ నామాలు (ఆంధ్రప్రదేశ్), దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు, అభ్యుదయ రచయిత పాలగుమ్మి పద్మరాజు, ప్రపంచ పుస్తక దినోత్సవం, పొందూరు ఖాదీ, ఖాదీ రంగంలో ఫ్యాషన్ టెక్నాలజీ, చింతన తదితర అనేక అంశాలపై ఆకాశవాణి విశాఖపట్నం, హైదరాబాద్, ఆదిలాబాద్ కేంద్రాలు కొండలరావు ప్రసంగాలను ప్రసారం చేశాయి. టాల్ రేడియో(డల్లాస్/టెక్సాస్)ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఊరి పేర్లపై నిర్వహించిన ఇంటర్వ్యూలలో పాల్గొని ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా నామవిజ్ఞానవేత్త కొండలరావును శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక(తెరవే) అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వేంకటరమణమూర్తి తదితరులు అభినందించారు.